ఏఐతో అన్ని రంగాల్లో పెను మార్పులు

హెచ్ఎంఏ నాయకత్వ సదస్సులో సెయింట్ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి

అమీర్ పేట్, ఫిబ్రవరి 8: ఏఐ టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ మన పనితీరులో మార్పులు చేసుకుంటున్నాయనే విషయాలను మనం గుర్తించాలని, అందుకు అనుగుణంగా మనం మన పనితీరును మార్చుకోవాల్సి ఉంటుందని సెయింట్ వ్యవస్థాపక చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి అన్నారు. అమీర్‌పేట్ లోని హోటల్ మ్యారీ గోల్డ్‌లో శనివారం జరిగిన హైదరాబాద్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ) నాయకత్వ సదస్సు-2025కు బీవీఆర్ మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభోపన్యాసం చేశారు. సదస్సులో భాగంగా పీడబ్ల్యూసీ భాగస్వామి రాజేష్ దొడ్డు, బీవీఆర్ మోహన్ రెడ్డి మధ్య జరిగిన ప్యానెల్ చర్చ అర్థవంతంగా సాగింది. 1960లో ప్రారంభమైన మొదటి ఏఐ అప్లికేషన్, 0.28 ఎంబీ ర్యామ్ సామర్థ్యంతో మాత్రమే ఉన్న అప్పటి కంప్యూటర్, తదనంతర కాలంలో చోటు చేసుకున్న పరిణామాలపై ఆసక్తికర సంభాషణ వీరి మధ్య చోటుచేసుకుంది. స్టాన్ఫోర్డ్ యూనివర్సిటీలో ఏఐ మొదటి పీహెచ్డీని 1960లోనే రాజిరెడ్డి రాజిరెడ్డి అనే భారతీయుడు పూర్తి చేసిన విషయంతో పాటు 1985 నాటి కాలంలో కంప్యూటర్ స్టోరేజికి ర్యామ్‌లు మొదట కేబీలో ఉండేవని ఆ తర్వాత ఎంబీ ఇప్పుడు జీబీలలో ఉన్నాయని, ఇవి ఇప్పుడు టీవీలకు కూడా చేరుకుంటున్నాయని, స్టోరేజ్‌కి కూడా మొదట 80 కేబీల ఫ్లాపి మాత్రమే ఉండేదని, ఇప్పుడు క్లౌడ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందని, చిన్న చిన్న సెన్సార్లు కూడా అందుబాటులో ఉండటంతో అవి డేటా సముద్రాన్ని మథనం చేస్తున్నాయన్నారు. దీంతో పాటు నాయకత్వ స్థానాలపై ఏఐ ప్రభావం వంటి అంశాలపై ప్యానల్ చర్చ ఆసక్తికరంగా కొనసాగింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ మదన్ మాట్లాడుతూ వైవిధ్యం అనేది చాలా అద్భుతమైనదన్నారు. అపోలో ఆసుపత్రుల డైరెక్టర్ సంగీతా రెడ్డి, ఐటీసీ గ్రూప్ హెడ్ శివ కుమార్, హెచ్ఎంఏ మేనేజింగ్ కమిటీ సభ్యులు అల్వాల దేవేందర్ రెడ్డి, కార్యదర్శి శరత్ చంద్ర, సహ కార్యదర్శి ప్రొఫెసర్ రేణుక సాగర్ పాల్గొన్నారు.

ఆ భవనం.. ఎప్పుడిస్తారో?

విద్యుత్ ఉద్యోగ సంఘాల ఎదురుచూపులు

- మూడు సంఘాలకు ఫ్లోర్ల కేటాయింపు ..
- స్వాధీనం చేయని టిజిఎస్‌పిడిసిఎల్
- అనుబంధ సంఘానికి కట్టబెట్టే దిశగా అధికార పార్టీ యత్నం..
- తమ కేటాయింపులను తమకు అప్పగించాలంటూ మిగతా సంఘాల డిమాండ్
- తామేమీ చేయలేమంటున్న అధికారులు..

సిటీబ్యూరో/ఖైరతాబాద్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ) : విద్యుత్ ఉద్యోగ సంఘాల కోసం నిర్మించిన భవనం చెప్పుకొని మురువా....చూసుకొని ఏడువ అన్న చందంగా మారింది. నిర్మాణం పూర్తయినా భవనాన్ని సదరు సంఘాలకు కేటాయించడంలో అధికారులపై ఒత్తిళ్లు కొనసాగుతున్నాయి. తమ అనుబంధ సంఘానికే మొత్తం భవనాన్ని ఇవ్వాలంటూ అధికారపార్టీ టిజిఎస్‌పిడిసిఎల్ అధికారులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. అసలు సాక్షాత్తు చీఫ్‌సెక్రటరీ చెప్పినా.. అధికారికంగా లేఖలు పంపినా.. సంఘాలకు వారి వారికి కేటాయింపుల ఆధారంగా అప్పజెప్పాల్సిన ఫ్లోర్ల విషయంలో అధికారులు మీన మేషాలు లెక్కపెడుతున్నారు. గతేడాదే ఆ భవనాన్ని అప్పగించాల్సి ఉండగా, అధికార పార్టీకి చెందిన కార్మిక సంఘం ఒత్తిడితో దాని అనుబంధ సంఘానికే ఆ భవనాన్ని మొత్తం కట్టబెట్టాలన్న ఆలోచనలో అధికారులు ఉన్నట్లు కేటాయింపు జరిగిన మిగిలిన ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. మూడు సంఘాలను సమన్వయం చేసే ప్రయత్నం చేసినా అధికారపార్టీ అనుబంధ సంఘం కోరుతున్న ప్రకారం చేస్తే మొత్తం భవనమే ఇవ్వాల్సి ఉండడంతో ఏం చేయాలో తెలియక అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు. దీంతో భవన కేటాయింపు ఎక్కడి గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

అన్ని హంగులతో నిర్మించినా...!

గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ప్రతిష్టాత్మకంగా సచివాలయ భవనం నిర్మాణానికి శ్రీకారం చుట్టిన క్రమంలో నాడు టీజిఎస్పీడీసీఎల్ పరిధిలో ఉన్న పలు విద్యుత్ ఉద్యోగ సంఘాలకు చెందిన భవనాలను స్వాధీనం చేసుకున్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వమే అన్ని హంగులతో కూడిన భవనాన్ని నిర్మిస్తుందని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చారు. దాని ప్రకారమే ఏడాది కాలంలోనే సెక్రటరియేట్ వద్ద రోడ్ల భవనాల శాఖ ద్వారా సిల్ట్ 5 భవన నిర్మాణం చేపట్టి హామీ నిలబెట్టుకున్నారు. ఒక్కో ఫ్లోర్ 1414.27 చొప్పున మొత్తం 8,485.62 ఎస్ఎఫ్‌టీలో భవనాన్ని నిర్మించారు. అందులో సిల్ట్ (గ్రౌండ్ ఫ్లోర్) పార్కింగ్ కోసం, మొదటి అంతస్తు కార్మిక సంఘాల మీటింగ్ హాల్, రెండో అంతస్తు తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, మూడు, నాలుగో అంతస్తులు టీఎస్‌స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ 327, ఐదో అంతస్తు విద్యుత్ ఏఈల అసోసియేషన్‌కు కేటాయించారు. ఈ భవన నిర్మాణం 2023 నవంబర్ నెలాఖరులోనే పూర్తయ్యింది. భవనాన్ని కేటాయించిన విద్యుత్ ఉద్యోగ సంఘాలకు అప్పగించేందుకు గాను జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ గత ఏడాదే చీఫ్ సెక్రటరీకి లేఖ రాసింది. దానిని పరిశీలించిన సీఎస్ వెంటనే ఆ ప్రక్రియ ప్రారంభించాలని (మెమో నం. 5687/ఎస్‌బీ/2024) ద్వారా ఆర్ అండ్ బీకి సూచించింది. దీంతో కేటాయించిన ఉద్యోగ సంఘాలకు భవనాన్ని అప్పగించాల్సిందిగా ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఎల్ ఆర్. నం. ఏఈఈ/డీబీ/ఈఈ/ఎఫ్‌బీడీ/టీఎస్ సెక్రటేరియేట్/2024-25, తేది. 18-12-2024)తో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీకి లేఖ రాసింది.

జాప్యం చేయడం ఆ సంఘం కోసమేనా..!

రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరుణంలో ఏడాది కాలంగా ఆయా ఉద్యోగ సంఘాలకు కేటాయించకుండా నాన్చుతూ వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎస్ నుంచి లెటర్ వచ్చిన వెంటనే ప్రక్రియను ప్రారంభించాల్సి ఉండగా, రెండేండ్లు పెండింగ్‌లో పెడుతూ వస్తున్నారని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. మూడు యూనియన్లకు ఫ్లోర్ల కేటాయింపునకు సంబంధించి ఆర్ అండ్ బీ నుంచి లేఖ వచ్చిన తర్వాత అసలు సమస్య మొదలైంది. ఎక్కువ స్థలం పోయింది. కాబట్టి, మొత్తం బిల్డింగ్ తమకే కావాలని 327 సంఘం పట్టుబడుతుంటే తమకు కేటాయించిన ఫ్లోర్లను తాము స్వాధీనం చేసుకుంటామని మిగతా రెండు సంఘాలు చెబుతున్నాయి. అయితే, ఈ వ్యవహారం కొంత ఇబ్బందిగా ఉండటంతో సీఎండీ ముషారఫ్ ఫరూఖీ సంఘాలను సమన్వయం చేసి వారి అభిప్రాయాలను తీసుకోవలసిందిగా సీజీఎం హెచ్ఆర్‌డీ భాస్కర్, ఎస్ఈ సివిల్ శ్రీనివాసరావులను కమిటీగా నియమించారు. ఈ నెల 3న కార్పొరేట్ ఆఫీస్‌లో జరిగిన సమావేశంలో మూడు యూనియన్ల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. అంతకు ముందు నుంచే ఈ సంఘాలకు భవనం ఇవ్వకుండా మొత్తం తమకే కావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వ అనుబంధ కార్మిక సంఘానికి చెందిన సంఘం నేతలు ఒత్తిడి తెస్తున్నారని మిగతా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో డిప్యూటీ సీఎం భట్టి కూడా అన్ని సంఘాలు కేటాయింపుల ప్రకారమే తీసుకోవాలంటూ చెప్పినా, అధికార పార్టీ ఒత్తిళ్లు మాత్రం తగ్గడం లేదు. ఈ విషయంలో ఉన్నతాధికారులు కూడా మాట్లాడకుండా ఒక్క సంఘానికే మొత్తం భవనాన్ని కట్టబెట్టేలా ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఇతర సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. తక్షణమే తమకు కేటాయించిన భవనాన్ని అప్పగించాలని వారు డిమాండ్ చేశారు.

మినట్స్ తీసుకున్నాం..సీఎండీకి పంపించాం

మూడు సంఘాలను పిలిచి సమావేశం నిర్వహించాం. ఇందులో ముగ్గురి అభిప్రాయాలు తీసుకున్నాం. తమ సంఘానికి సంబంధించిన స్థలం ఎక్కువగా పోయిందని, అందుకే మొత్తం తమకే ఇవ్వాలని ఒకరు చెబుతుంటే ఇద్దరు మాత్రం తమకు కేటాయించిన ఫ్లోర్లను అప్పగించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని మినట్స్ రూపంలో సీఎండీకి పంపించాం. అయితే, ఆర్ అండ్ బీ వాళ్లు మాతో ఒప్పందం ప్రకారం, 10 వేల చదరపు అడుగుల్లో నిర్మిస్తామని చెప్పినంతగా బిల్డింగ్ నిర్మించ లేదు. కేవలం ఆరు నుంచి ఏడువేల చ.అ.ల్లో బిల్డింగ్ ఉంది. దీనిని ఎలా పంపకం చేయాలో అర్థం కావడం లేదు. ఒకవైపు నిర్మాణం చేయడమే కాకుండా అలాట్‌మెంట్ కూడా వాళ్లే చేసి ఇచ్చారు. మా సంఘాల్లో గొడవ పెట్టారు. ఈ విషయంపై నిర్ణయం మేనేజ్‌మెంట్ తీసుకోవాలి.

– శ్రీనివాసరావు, ఎస్ఈ (సివిల్);

నార్సింగి గురుకులంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

నార్సింగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు *– మణికొండ, ఫిబ్రవరి 8;*

మహీంద్రా ఎక్స్ఈవీ 9ఈ, బీఈ 6 ఈవీ కార్ల లాంచ్

కొండాపూర్, ఫిబ్రవరి 8: మహీంద్రా ఎలక్ట్రిక్ ఆరిజిన్ ఎస్ నూతనంగా మార్కెట్ లోకి తీసుకువస్తున్న ఎక్స్ఈవీ 9ఈ, బీఈ 6 మోడల్స్ ఎలక్ట్రానిక్ (ఈవీ) కార్ల బుకింగ్స్ ఫిబ్రవరి 14 నుంచి తీసుకుంటున్నట్లు తీసుకుంటున్నట్లు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ మహీంద్రా ఆటోమేటిస్ రీజినల్ మేనేజర్ అభిషేక్ కుమార్ తెలిపారు. మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన రాంప్ అప్ కార్యక్రమంలో ఎక్స్ఈవీ 9ఈ, బీఈ 6 మోడల్స్ ని సినీ హీరో శ్రీకాంత్, ఏపీ అండ్ తెలంగాణ రీజినల్ మేనేజర్ అభిషేక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అభిషేక్ కుమార్ మాట్లాడుతూ మహీంద్రా ఈవీ కార్లు ప్రపంచంలో న్యూ బెంచ్‌మార్క్ సెట్ చేస్తుందన్నారు. సేఫ్టీ, విలాసవంతమైన సౌకర్యాలు ఇందులో ఉన్నాయని తెలిపారు. ఎక్స్ఈవీ 9ఈ, బీఈ 6 మోడల్స్ లలో మొత్తం 9 వేరియంట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రెండు మోడల్స్ లో 8 కలర్స్ ఉన్నాయని ఈ నెల 14 తేదీ నుంచి బుకింగ్స్ ప్రారంభిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కి చెందిన మహీంద్రా కారు షోరూమ్ డీలర్లు పాల్గొన్నారు.

పతంజలి ఆధ్వర్యంలో వరల్డ్ బుక్ ఫెయిర్

సిటీ బ్యూరో, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ): యోగా, ఆయుర్వేదం, విద్య, పరిశోధన, చికిత్స విధానాలపై వరల్డ్ బుక్ ఫెయిర్ ఏర్పాటు చేశామని పంతంజలి యోగాపీఠ్ జనరల్ సెక్రటరీ ఆచార్య బాలకృష్ణ తెలిపారు. ఈ బుక్ ఫెయిర్‌ను భారత విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ బుక్ ట్రస్ట్ సౌజన్యంతో ఢిల్లీలోని ప్రగతి మెయిడెన్, భారత్ మండపం వద్ద ఏర్పాటు చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యోగాకు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందేలా పతంజలి కృషి చేస్తోందని చెప్పారు. యోగా ప్రాముఖ్యత, మానవ ఆరోగ్యానికి ఆయుర్వేదం ఉపయోగాలకు సంబంధించిన సమాచారాన్ని తెలిపే వేలాది పుస్తకాలను ప్రదర్శించామని చెప్పారు. ప్రపంచంలోని 32 వేల ఔషధ మొక్కల ఉపయోగాలు తెలిపే పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. పతంజలి ఉత్పత్తులు వ్యాపార దృక్కోణంలో కాకుండా ప్రజల ప్రయోజనాలు, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తయారు చేస్తున్నామని వివరించారు. బుక్ ఫెయిర్‌ను భారతీయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెదవి చీలిక చిన్నారులకు ఉచిత శస్త్రచికిత్సలు

ముస్కాన్ 2025 కార్యక్రమంలో భాగంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న హిమాలయ వెల్నెస్ సంస్థ, స్మైల్ ట్రైన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు.

బంజారాహిల్స్, ఫిబ్రవరి 08: పుట్టుకతోనే పెదవి చీలిక సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చేయూతనిచ్చేందుకు ''ముస్కాన్ 2025'' పేరుతో సామాజిక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హిమాలయ వెల్నెస్ సంస్థ బిజినెస్ డైరెక్టర్ రాజేష్ కృష్ణ మూర్తి తెలిపారు. బంజారాహిల్స్ లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వద్ద శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో స్మైల్ ట్రైన్ స్వచ్ఛంద సంస్థతో కలిసి చేపట్టిన ముస్కాన్ 2025 ప్రచార కార్యక్రమాన్ని రాజేశ్ కృష్ణ మూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా పెదవి చీలిక సమస్య ఉన్న చిన్నారులకు ఉచిత శస్త్రచికిత్సల కోసం సాయం చేస్తున్నామన్నారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలలో ఈ సమస్యతో ప్రతియేటా 2400 మంది చిన్నారులు జన్మిస్తున్నారని, వారిలో కొందరికి అయినా చిరునవ్వులు తిరిగి అందించాలని తమ సంస్థ భావిస్తున్నదని తెలిపారు. ఇప్పటికే 2000 మందికి తమ సంస్థ ద్వారా శస్త్ర చికిత్సల కోసం సాయం అందించామని, రానున్న రోజుల్లో మరింత మందికి ఈ సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు వారికి ఉచిత శస్త్ర చికిత్స అవకాశాలను గురించి వివరించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రచార కార్యక్రమాలను ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్మైల్ ట్రైన్ స్వచ్ఛంద సంస్థ ఏషియా సీనియర్ ఉపాధ్యక్షులు మమతా కరోల్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల తడకగా బీసీ కుల గణన

సినీ నిర్మాత రాజు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్రంలో బీసీ కుల గణన తప్పుల తడకగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిందని సినీ నిర్మాత రాజు అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ ఆనంద్ బాగ్ చౌరస్తాలో కాంగ్రెస్ ప్రభుత్వం శనివారం నిర్వహించిన బీసీ కుల గణనకు వ్యతిరేకంగా తెలంగాణ బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఉదయం గంటలకు ఆనంద్ బాగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నిర్మాత టి.రాజు హాజరై మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన సర్వే తప్పుల తడకగా ఉందని బీసీ వర్గాలను తక్కువ చేసి చూపారని ఆరోపించారు. సామాజిక ఆర్థిక రాజకీయ రంగాలన్నింటిలో వివక్షకు నిర్లక్ష్యానికి గురైన బీసీ లంతా సంఘటితమై రాజ్యాధికారంలో న్యాయమైన వాటా సాధించేందుకు పాలకులపై సమర శంఖం పూరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి కామళ్ల ఐలన్న అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్రంలో అధిక సంఖ్యలో బీసీ జనాభా ఉన్నప్పటికీ అడుగడుగునా అన్యాయం జరుగుతుందని, విద్య, ఉపాధి రాజకీయ తదితర రంగాల్లో ఎదగ లేక పోతున్నామన్నారు. లెక్కించాల్సింది బీసీలను కాదని ఓసీలనని ఓసీ జనాభా ఎంత ఉంటే రిజర్వేషన్లు అంత కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు జీనుకుంట్ల రమేశ్ గౌడ్, కార్యదర్శిలు చేకూరి రామ్మోహన్, కాసర్ల నాగరాజు, ఉడుత నవీన్, జోగు శ్రీనివాస్, బి దశరథ్, సీహెచ్ వెంకటయ్య, పిట్టల భాస్కర్ భాగ్యలక్ష్మి పేపర్ శ్రీను సంతోష్ కుమార్ కుమ్మరి రాజు, బాలచందర్ గౌడ్, పి సత్యనారాయణ రజక సంపత్ రజక తదితరులు పాల్గొన్నారు. అనంతరం, మూడు గంటలకు, బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు వీకే మహేశ్ దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరవింపజేశారు.

ఎడ్యుకేషన్ వరల్డ్.. ఎర్లీ చైల్డ్‌హుడ్

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్దనున్న మారియట్ హోటల్‌లో శనివారం ఇండియా ప్రిస్కూల్ ర్యాంకింగ్స్ 2024-25 అవార్డులు, ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ నేషనల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించింది. దేశ వ్యాప్తంగా 138 నగరాల నుంచి 360 మంది ప్రిస్కూల్ యజమానులు కార్యక్రమంలో ఎడ్యుకేషన్ వరల్డ్ సీఈఓ భవిన్‌షా చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

హైకోర్టు మార్గదర్శకాలు అమలు చేయాలి

విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మలను విభజిస్తే సహించం

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మధన్‌మోహన్, లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లెటి కృష్ణామాచార్యులు

రవీంద్రభారతి, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను వృత్తుల పరంగా విభజిస్తే సహించేది లేదని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్‌లో సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్ మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఘణి రవీంద్రాచారిలు మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాత్ర సంఘం జాతిని హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జాతిని విస్మరిస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల పాత్ర కీలమైనదని, మా మనోభావాలను కించపరిస్తే ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సంఘం అధ్యక్షుడు పులిగిళ్ళ శ్రీనివాసాచారి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పబ్బోజు భిక్షపతి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు దేవరకొండ వీరాచారి, రాళ్ళబండి విష్ణుచారి, నెళ్ళోసాల్వాచారి, సుదర్శనాచారి, దాసోసు పుష్పలత, యశోద, వీరగంటి వీరేశం పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణతో న్యాక్ ఉద్యోగ అవకాశాలు

మాదాపూర్, ఫిబ్రవరి (నమస్తే తెలంగాణ)8: నేషనల్ అకాడమి ఆఫ్ కన్ స్ట్రక్షన్ (న్యాక్) లో నిరుద్యోగ యువతకు కోర్సులను ఏర్పాటు చేసి నాణ్యమైన నైపుణ్య శిక్షణతో 100 శాతం ఉద్యోగ అవకాశాలను కల్పిస్తుంది. ఆసక్తి గల అభ్యర్థులు సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, యాంకరింగ్, డబ్బింగ్, వాయిస్ ఓవర్ స్కిల్స్ కోర్స్ కొరకు ఫోన్ నం. 9000149225, లాండ్ స్కేప్ డిజైన్, ఇంటీరియర్ డిజైన్ కోర్స్ కొరకు ఫోన్ నం.90632 08703, స్టోర్ కీపర్ కోర్స్ కొరకు ఫోన్ నం.96767 06414, ఎంఈపీ, ఫినిషింగ్‌స్కూల్ కోర్స్ కొరకు ఫోన్ నం.70971 14947 నంబర్స్ ను సంప్రదించి రిజిస్టర్ చేసుకోగలరు.

నగదు రూపంలోనే పరిహారం

ఎలివేటెడ్ కారిడార్‌లో బాధితుల డిమాండ్లకు తలొగ్గిన హెచ్ఎండీఏ

రూ.150 కోట్లు పరిహారంగా చెల్లించాల్సి ఉంటుందని ప్రాథమిక అంచనా.

సిటీబ్యూరో, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ): హెచ్ఎండీఏ చేపట్టనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులకు పరిహార చెల్లింపు నగదు రూపంలోనే జరగనుంది. నార్త్ సిటీ మీదుగా రెండు ఎలివేటెడ్ కారిడార్లను దాదాపు రూ.12 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టేందుకు హెచ్ఎండీఏ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో జేబీఎస్ నుంచి తూంకుంట వరకు, ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంలోని డెయిరీ ఫాం రోడ్డు వరకు మొత్తంగా 23 కిలోమీటర్ల పొడువైన ఎలివేటెడ్ కారిడార్ రానుంది. ఇందులో ఒక వైపు డబుల్ డెక్కర్ రానుండగా, మరోవైపు అతి తక్కువ పొడవైన టన్నెల్ రోడ్డును హెచ్ఎండీఏ నిర్మించనుంది. అయితే, ప్రాజెక్టు కోసం ఓవైపు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతుంది. మరోవైపు పరిహారం, రోడ్డు వెడల్పు అంశంపై స్థానికులు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తుండగా, ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన భూముల సేకరణకు అటు మేడ్చల్, హైదరాబాద్ జిల్లా రెవెన్యూ అధికారులతో కలిసి హెచ్ఎండీఏ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఈ క్రమంలో ప్రాజెక్టులో భూములు కోల్పోతున్నవారికి పరిహారం నగదు రూపంలోనే చెల్లించాలనే ప్రతిపాదనకు ఖరారైనట్లుగా తెలిసింది. గతంలో టీడీఆర్ రూపంలో పరిహారం చెల్లించేందుకు హెచ్ఎండీఏ సిద్ధమైనా, క్షేత్రస్థాయిలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అదే విధంగా ప్రాజెక్టు వెడల్పుపై తీవ్ర అసహనం వ్యక్తం అవుతూనే ఉంది. అయితే, పరిహారం ఇప్పటికీ కొంతమంది కోల్పోతున్న భూమికి సమానంగా అభివృద్ధి చెందిన లే అవుట్లలో ఓపెన్ ప్లాట్లు ఇవ్వాలనే స్థానికుల డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి వరకు పరిహారాన్ని నగదు రూపంలో చెల్లించాలనే ప్రతిపాదనకు అంగీకారం తెలిపిన నేపథ్యంలో రూ.150 కోట్లు మేర ప్రాథమిక దశలో పరిహారంమిచ్చే అవకాశం ఉంది.

నగదు రూపంలో చెల్లింపులు

నార్త్ సిటీకి రవాణా సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఎలివేటెడ్ కారిడార్‌కు పరిహారాన్ని నగదు రూపంలోనే చెల్లించనున్నారు. రెండు మార్గాల్లో 23 కిలోమీటర్ల మేర అందుబాటులోకి వచ్చే ప్రాజెక్టు కోసం రూ.150 కోట్లు ఖర్చు అవుతుందని హెచ్ఎండీఏ అంచనా వేసింది. రోడ్డుకు ఇరువైపులా 200 ఫీట్ల మేర ఆస్తులను సేకరించేందుకు ఇప్పటికే గుర్తించిన ప్రాంతంలోని ఆస్తి యజమానులతో సంప్రదింపులు మొదలు పెట్టారు. దీని కోసం ఓవైపు అభిప్రాయం కోరుతూనే మరోవైపు గ్రామ సభల ద్వారా భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణను ఆయా జిల్లాల యంత్రాంగం చేపడుతోంది. దీనిలో మేడ్చల్ జిల్లాలో 380 ఆస్తులకు, హైదరాబాద్ జిల్లాలో 350-400 ఆస్తులకు పరిహారాన్ని టీడీఆర్‌కు బదులు నగదులోనే చెల్లించే అవకాశం ఉంది.

ఆగని డిమాండ్లు...

ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుల విషయంలో ఇప్పటికీ స్థానికుల నుంచి పలు డిమాండ్లు వ్యక్తమవుతూనే ఉన్నాయి. భూములు కోల్పోతున్న వారికి పరిహారం ఇప్పటికీ కొంత మంది కోల్పోతున్న భూమికి సమానంగా డెవలప్ చేసిన ప్లాట్లను పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

తప్పుల తడకగా వర్గీకరణ: కాంబ్లే

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్న వర్గీకరణ లెక్కలు తప్పుల తడకగా ఉందని సమతా సైనిక్ దళ్ జాతీయ నాయకులు మార్షల్ దిగంబర్ కాంబ్లే అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాం ప్రసాద్‌తో కలిసి మార్షల్ దిగంబర్ కాంబ్లే మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఏకపక్షంగా 4న వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ ఆ రోజును సామాజిక న్యాయ దినం నిర్వహించాలని పిలుపునిచ్చారని, కానీ, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సాక్షిగా తప్పుల తడకలైన ఎస్సీ ఉప వర్గీకరణ, కుల గణన నివేదికలను ప్రవేశపెట్టి ఆమోదం పేరుతో సామాజిక న్యాయాన్ని ఖూనీ చేసినట్లు భావిస్తూ, ఆ రోజును చీకటి రోజుగా, సామాజిక న్యాయ విద్రోహ దినంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.అనంతరం, ప్రభుత్వం విడుదల చేసిన వర్గీకరణ పత్రాలను మాల సంక్షేమ సంఘం నాయకులు ర